# బంధం - సంబంధం



వేదగిరి రాంబాబు

**"అబ్బ! ఏమిటిది మరీ చిన్నపిల్లలై పోతున్నారు!"**

**"ఊహూఁ! ఇవాళాఫీసుకెళ్ళను నీదగ్గరే వుండిపోతాను"**

**ఇద్దరివీ నవ్వులు —**

"బావుంది! ఆఫీసు కెళ్ళకుండా ఎవరైనా పెళ్ళాం కొంగు పట్టుకు తిరుగుతారేమిటి ?"

"అందరి సంగతి వేరు – నా బంగారు బొమ్మ సంగతి వేరు. నీ కున్నంత అందం ఎంతమంది కుంటుంది ?"

"మీరు మాత్రం? – హిందీ సినిమా హీరోలా లేరేమిటి ?"

కొద్ది క్షణాలు నిశ్శబ్దం –

మళ్ళీ నవ్వులు –.

పిచ్చెక్కినట్లుంది నాకు. నేనా రూమ్‌లోకి వచ్చి ఇంకా ఇరవైనాలుగ్గంటలు కూడా కాలేదు. వాళ్ళ ఆప్యాయత, అనురాగం నాలో ఓ విధమైన సంచలనాన్ని కల్గించడం ప్రారంభించింది.

రూమ్‌కి తాళం వేసి రోడ్డుమీదకొచ్చాను.

సరిగ్గా అదే సమయంలో పక్క వాటాలోంచి అతనూ బయటకొచ్చాడు. అతని వెనకే ఆమె గుమ్మంలోకి వచ్చింది

రెండడుగులు వేసి అతను వెనక్కి తిరిగాడు.

ఆమె నవ్వుతూ అతనివంక చూసింది.

అతను చెయ్యూపాడు.

ఆమె చెయ్యూపింది.

"సాయంత్రం ఆఫీస్నైపోగానే వచ్చేస్తారు కదూ ?"

"అయిదున్నరకల్లా ఇంట్లో వాల్తాను."

అతను బయల్దేరాడు.

ఆమె అలాగే గుమ్మంలో నిలబడి చూస్తోంది.

అతను వుండుండి వెనక్కి తిరిగి చూస్తున్నాడు.

నాకు నవ్వొచ్చింది !

ఆశ్చర్యం కూడా కల్గింది !

ఎంతటి అన్యోన్య దాంపత్యం వాళ్ళది ! వద్దనుకున్నా పక్కవాటానే కావడంచేత వాళ్ళ కబుర్లు, సరసాలు వినబడుతూనే వుంటాయ్ !

బస్ స్టాప్‌కి చేరుకున్నాను.

అతనూ వచ్చి నా పక్కనే నిలబడ్డాడు.

ఓ క్షణం అతనివంకే చూశాను.

నిజమే ! అతని భార్య అన్నట్లే హిందీ సినిమా హీరోలాగానే వున్నాడు.

ఇంతలో బస్సొచ్చింది.

గుంపులోకి జొరబడ్డాను నేనెక్కే తొందరలో అతనా బస్సు ఎక్కేడో లేదో గమనించలేదు.

* * *

సాయంత్రం అయిదున్నరకల్లా రూమ్‌కి చేరుకున్నాను. అప్పటికే అతనొచ్చేసినట్లున్నాడు. పక్క వాటాలోంచి నవ్వులు వినబడుతున్నాయ్.

"ఏమండీ ! ఇవాళేదైనా సిన్మాకెళ్దామా ?" అడిగిందామె.

"సినిమాకా ? వద్దు. మూడు గంటలసేపు నువ్వు ప్రక్కనున్నా వంటరితనం అనుభవించాలి. సినిమాహాల్లో మీద చెయ్యేసినా 'డిగ్నిటీ' మీద ఓ చిన్నసైజు వుపన్యాసాన్నిస్తావ్."

"లేకపోతే ! అంతమంది మధ్యలో అలాంటి పన్లు చెయ్యడానికి మీకు సిగ్గన్నా వెయ్యదూ !"

"అందుకే మేడమ్ ! ఆ సినిమా పేరున నువ్వు నా ప్రక్కనున్నా దూరంగా వుండటం నావల్ల కాదు, హాయిగా ఇంట్లోనే వుండిపోదాం."

"అంటే – ఇంట్లో వుంటే మాత్రం మీ కెదురుగా కూర్చుంటానా? చాలా పన్లున్నాయ్."

"ఇద్దరం కలిసి – ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపు సొలుపేమున్నది ..." అతను పాటందుకున్నాడు.

"స్వామీ! కాస్త మీ పాటాపండి. ఆడుతూ పాడుతూ ఇప్పుడేమీ పని చెయ్యక్కర్లేదు. మీరాఫీసు నించి వచ్చేసరికే పనంతా పూర్తి చేసుకున్నాను. మీరు కాస్త మొహం కడుక్కొస్తే కాఫీ తాగుదాం. ఆ తర్వాత అలా పార్క్‌కేసి వెడదాం."

"అలాగే ! దేవీగారి ఆజ్ఞ !"

ఒక్క నిముషం నిశ్శబ్దం.

బహుశా అతను మొహం కడుక్కోటానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళుంటాడు.

కప్పుల శబ్దం –

అంటే ఆమె కాఫీ కప్పులో పోస్తుండాలి.

"ముందు నువ్వు తాగు, తర్వాత నేను తాగుతాను."

''కాదు! ముందు మీరే తాగండి.''

''నువ్వు తాగుతేనే నేను తాగుతాను.''

''ఎన్నిసార్లు చెప్పానండి. నాకు మీ ఎంగిలి తాగడం ఇష్టం — కానీ, మీరు నా ఎంగిలి తాగడం ఇష్టంలేదు.''

''సరేలేకాని, ఓసారిలా దగ్గరకి రా.''

''ఎందుకు ?''

''మాట''

''ఇక్కడ చెప్పకూడదా ?''

''కూడదు. చెవిలోనే చెప్పాలి.''

ఓ క్షణం నిశ్శబ్దం.

''ఛీ...పోండి. తలుపులు తీసేవున్నాయ్ అవతల'' నవ్వులు.

నాకు మతి పోతోంది. వాళ్ళ మాటల్నించీ తప్పించుకోడానికి ట్రాన్సిస్టర్ ఆన్ చేశాను.

మరికొద్ది సేపట్లో షికారు కెళ్తూ కన్పించారు వాళ్ళిద్దరూ! నిజమే అతనన్నట్లు ఆమె బంగారు బొమ్మలాగానే వుంది! వాళ్ళిద్దర్నీ చూస్తుంటే ఎంతో చూడముచ్చటగా వుంది.

వాళ్ళ అన్యోన్యతని చూస్తుంటే ముచ్చటతో పాటు ఈర్ష్యకూడా కల్గింది నాలో.

వాళ్ళిద్దరూ ఒకళ్ళకోసం మరొకళ్ళు సృష్టింపబడ్డారు. అన్నివిధాల అంతగా కల్సిపోయే భార్య దొరకడం ఎంత అదృష్టం! అటువంటి అదృష్టం నన్నూ వరిస్తే ఎంత బావుండు. సరదాగా నవ్వుతూ, తుళ్ళుతూ; చీకూ, చింతా లేకుండా జీవితాన్ని గడిపేయవచ్చు. తీయటి అనుభూతుల్ని వూహించుకుంటూ అలా ఎంతసేపు గడిపానో నాకు తెలీదు. గదంతా చీకటి క్రమ్మేసరికి, లేచి లైటేసి వాచీ చూసుకున్నాను.

ఏడుంబావు!

మొహం కాళ్ళూ, చేతులు కడుక్కుని భోజనానికి హోటల్‌కి బయల్దేరాను.

సందు మొదట్లో ఇంటికి తిరిగొస్తూ వాళ్ళిద్దరూ ఎదురొచ్చారు.

* * *

మర్నాడు సాయంత్రం కూడా నేనొచ్చేసరికి ప్రక్క వాటాలోంచి మాటలు వినబడుతున్నాయ్.

''డియర్! రేపు సాయంత్రం కాంప్ కెళ్ళాలి.''

''ఎన్నాళ్ళు ?''

''నాల్గు రోజులు.''

''అమ్మో! నాల్గు రోజులే! నేను వంటరిగా వుండలేను మీతో వచ్చేస్తాను.''

''నేనూ అదే అనుకుంటున్నాను. నిన్నొదిలి నేను మాత్రం వుండగలనా ఏమిటి? అందుకనే ఇద్దరం కల్సివెళ్దాం. ఏదైనా ఓ హోటల్లో వుందాం. పగలల్లా ఆఫీసు సేవ, సాయంత్రం నించి దేవీగారి సేవ.''

''అలా చేస్తే మీ కాఫీసు పనిమీద వెళ్ళినట్లే వుండదు. ఇంచక్కా హనీమూన్ వెళ్ళినట్లు వుంటుంది. అవునా ?''

ఇద్దరి నవ్వులు —

ఉద్యోగరీత్యా ఇంతవరకూ ఎన్నో వూళ్ళు తిరిగాను, ఎంతోమందిని చూశాను కానీ, ఇంత అన్యోన్యత, అనురాగం వున్న జంటని మాత్రం ఎక్కడా చూళ్ళేదు. కనీసం కాంప్‌లో వున్న నాల్గు రోజుల ఎడబాటుని కూడా భరించలేని వాళ్ళ బంధం ఎంత గొప్పది!

రేపు వివాహమైతే నేంకూడా ఇలాగే వుండాలి — ఒకళ్ళ కోసం మరొకళ్ళు. అప్పుడే వుంటుంది తృప్తి.

ఆ రాత్రంతా నా మెదడులో ఆ ఆలోచన్లే!

* * *

మర్నాడు నిద్ర లేచేసరికి వంట్లో నలతగా వున్నట్లనిపించింది. దానికి బద్ధకంకూడా తోడైంది.

బస్‌స్టాప్ దగ్గర్లోనే వుంటున్న లక్ష్మీపతి ఇంటికెళ్ళి లీవ్‌లెటర్ ఇచ్చి వద్దామని బయల్దేరాను.

అప్పుడే అతనూ ఇంట్లోంచీ బయటికొచ్చాడు. ఆమె మామూలుగా చెయ్యూపింది. అతనూ చెయ్యూపుతూ బయల్దేరలేక బయల్దేరినట్లుగా బయల్దేరాడు.

పది గజాలు నడిచానో లేదో 'హల్లో!' అంటూ విన్పించింది. తలెత్తి చూశాను.

అతను ఫ్రెండ్ కాబోలు! ఇద్దరూ కల్సి మాట్లాడుకుంటూ నడవసాగారు. వాళ్ళకి కొద్ది వెనగ్గా నేను నడుస్తున్నాను. చాలాకాలం తర్వాత కల్సినట్లు తెలుస్తోంది వాళ్ళ మాటల్నిబట్టి!

''ఇప్పుడు నువ్వు విజయవాడలోనే వుంటున్నావా ?'' అడిగాడతను.

''సంవత్సరమైంది బందరు బదిలీ అయి. ఈ వీధి చివరే మా పిన్నత్తగారిల్లు. వాళ్ళమ్మాయి పెళ్ళికి నిన్ననే మా ఆవిడ్తో వచ్చాను.'' జవాబిచ్చాడు అతని స్నేహితుడు.

''ఇంకెన్ని రోజులుంటా విక్కడ ?''

''రేపుదయం వెళ్ళిపోదాం అనుకుంటున్నాం.''

''మా ఇంటికి రాకుండానే వెళ్తారా ?''

''మీ ఇల్లెక్కడ ?''

''అదిగో! ఆ గోపీ రంగు మేడలో గేటు కెదురుగా వున్న వాటా!'' వెనక్కి తిరిగి ఇంటికేసి చూపిస్తూ అన్నాడు.

''అయితే రేపుదయం వెళ్ళబోయేముందు మీ ఇంటికొస్తాం.''

''సారీ బ్రదర్! ఇవాళ సాయంత్రం కాంప్‌కి వెళ్తున్నాను. వీలైతే ఇవాళ సాయంత్రం ఆరు గంటల్లోపే రండి.''

''ఇవాళ మధ్యాహ్నం మా బావమర్ది ఇంటికెళ్తున్నాం. అతను మరీ మరీ చెప్పాడు. వెళ్ళకపోతే బావుండదు. పోనీ, రేపుదయం వస్తే మీ ఆవిడుంటుంది కదా! ఆవిడకి మా ఆవిడ్ని పరిచయం చేస్తాను.''

''రేపిక్కడ ఆవిడ కూడా వుండటల్లేదు నాతోపాటే తీసుకెళ్తున్నాను.''

ఆ మాట వినగానే స్నేహితుడు ఫక్కున నవ్వేడు.

''అంటే! నువ్వు కాలేజీలో చదివే రోజుల్లో మాట్లాడిన మాటల్ని 'తు. చ.' తప్పకుండా పాటిస్తున్నావన్నమాట!'' బలవంతాన నవ్వు నాపుకుంటూ అన్నాడు స్నేహితుడు.


కొన్ని క్షణాలు అతను మౌనంగా వూరుకుని నెమ్మదిగా అన్నాడు.


''ఎప్పటికైనా నా అభిప్రాయం మారదురా బాబు! 'స్త్రీ' అంటే చపలచిత్తురాలు! మున్నాటికీ అంతే! పాత్ర స్వరూపాన్నిబట్టి ద్రవం ఆకారం మారినట్టే, పరిసరాల్నిబట్టి స్త్రీ స్వభావం కూడా మారుతూంటుంది. కాబట్టే మగాడెప్పుడూ వీలైనంత వరకూ వాళ్ళని కనిబెట్టుకుని తమ పరిధిలోనే వుండేలా చూసుకోవాలి. అందుకే మా ఆవిడ్నికూడా కాంప్‌కి తీసుకెళ్తున్నాను. కాంప్‌కే కాదు! నే నెక్కడికి వెళ్ళినా తనుండాల్సిందే! తనెక్కడికి వెళ్ళినా నేనుండాల్సిందే!''

అతని స్నేహితుడేమీ మాట్లాడలేదు. అదోలా నవ్వి వూరుకున్నాడు.

నేను వుక్కిరిబిక్కిరయ్యాను.

'ఏవిటి తను మాట్లాడేది! భార్యతో అంత అన్యోన్యంగా వున్నా అతని మనసులో ఇలాంటి సంకుచిత భావాలున్నాయా? పైకి ఆమె విషయంలో చూపేదంతా నటనేనా ?'





* మీకు తెలుసా? *

* సర్వరోగనివారిణి *

## * "జిన్‌సెంగ్" *

పై బొమ్మలో మానవాకారంలో వున్నట్లున్న "దుంప" కొరియాలో మాత్రం పండుతుంది! దీన్ని మనవాళ్ళ సంజీవిని, సర్వరోగ నివారిణి, "త్రైలోక్య చింతామణి" అని పిలిచే అపురూపమైన "ఓషధి మొక్క"లతో పోల్చవచ్చును...అసలీ దుంప పేరే "మానవాకారంలో వుండే దుంప" — "జిన్ సెంగ్" అన్న చైనా మాటలకి అర్థం అదిట! వనస్పతి విజ్ఞాతలు దీన్ని "క్యూర్ ఆల్" గానే నమ్ముతున్నారు.

ఈ జిన్‌సెంగ్ ఓషధి కందమూలాలు "పొడి", "మాత్రలు", "గొట్టాలు"గా కొరియా జపాన్, చైనా దేశాలలో దొరుకుతుంది.

దీంతో "తేనీటి పొడి" శీతల పానీయం పొడి (మనం ధనియాల టీ, సుగంధపాలు త్రాగినట్లు) చేసుకుని సేవిస్తారు కూడా. ఇది సర్వరోగ నివారిణి. దీన్ని తైలంలో కలిపి రాసుకుంటే జుత్తు ఒత్తుగా పెరుగుతుంది. వంటికి మర్దన చేసుకునే లేహ్యంగా, తలంటుకునే షాంపూగా చివరికి టూత్ పేస్టులో కూడా కలిపి వాడుతూంటారు. ఆరోగ్యపుష్టికి అందాన్ని యినుమడించటానికి, వీర్య పుష్టికికూడా యీ "జిన్‌సెంగ్" దుంపను రకరకాలుగా వాడుతారు. కాని యిది చాలా సున్నితమైన "ట్యాప్ రూట్" కొరియాలోనే తప్ప యితరచోట్ల ఎదగదు. ఈ దుంప "పెరుతున్నప్పుడు" వర్షం — మంచు చివరికి వెల్తురూ గాలీ అన్నీ తగు మోతాదులోనే వుండాలి తప్ప మోతాదు మించితే రోగాలన్నింటికి మందైన యీ "మందు మూలం" మందు అడగకుండా చస్తుంది! అయితే బాగా ఆరోగ్యవంతులైనవారు దీన్ని టానిక్‌లాగా తెగ తినేస్తే ప్రమాదమా? అన్న విషయం ప్రస్తుతం పరిశోధనలో వున్నది. దీన్ని హోమియోపతి మందులలో కూడా వాడుతున్నారు.

జపాన్, చైనా, తైవాన్, హాంగ్‌కాంగ్, అమెరికా పశ్చిమ జర్మనీలు దీన్ని కొరియా నుంచి కొనుక్కుంటున్నాయి. మొత్తం 57 లక్షల కిలోల జిన్‌సెంగ్ పొడిని కొరియా ఎగుమతి చేస్తుంది. మరో నాలుగేళ్ళకి దీనిమీద కొరియాకి వచ్చే విదేశ మారకద్రవ్య ఆదాయం పది కోట్ల డాలర్ల దాకా వుంటుందట! కొరియా వెళ్లే విలాస యాత్రికులు దీన్ని మార్కెట్‌లో "వేటాడి" పట్టుకుని కొనుక్కుంటారుట! దీని సంగతి బాగా తెల్సిన హోమియోపతి లేడీ డాక్టర్ మన దేశంలో నాగపూర్‌లో వున్న డా. రెనూ కోచార్‌గారే నంటారు. [ పీరాజీ ]

## బంధం — సంబంధం

వళ్ళు జలదరించినట్లైంది నాకు. మరొక్క మాట కూడా వాళ్ళ సంభాషణ వినాలనిపించలేదు. త్వరత్వరగా అడుగులేసుకుంటూ వాళ్ళని దాటి ముందుకి నడిచాము.

లక్ష్మీపతికి లీవ్ లెటరిచ్చి గదికి చేరి పడుకున్నాను. ఏదో నవల చదవాలని ప్రయత్నించాను కాని మనసు కేంద్రీకృతం కావడంలేదు. ఉండుండి అతని మాటలే గుర్తుకొచ్చి అతనిమీద ఓ విధమైన అసహ్యభావం — ఆమెమీద సానుభూతి చోటు చేసుకోసాగాయ్.

ఈ ఆలోచనలో —

ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నం రెండు దాటింది. ప్రక్కవాటాలోంచి ఆమె గొంతు మరో స్త్రీ గొంతు కలగా పులగంగా వినబడుతున్నాయ్.

"అబ్బాయితోపాటు నువ్వెందుకమ్మా క్యాంప్‌కెళ్ళడం?" ఆ గొంతుకడుగుతోంది.

"మీకు తెలీదు పిన్నిగారూ! ఈ మగాళ్ళని నమ్మటానికి వీల్లేదు. పెళ్ళాం పక్కన లేకపోతే ఎన్ని వెధవ్వేషాలైనా మొలకెత్తుతాయి వాళ్ళ మనసుల్లో. పైగా ఈ మనిషి కొంచెం అందంగా కూడా వున్నారేమో, కనిపెట్టి వుండకపోతే నాకు దక్కరు! మరెవర్తో దక్కించుకుపోతుంది! అదృష్టంగాని పిన్నిగారూ! కాస్త ఈ నాల్గు రోజులు మా మొక్కల నీళ్ళ విషయం చూద్దురూ మీకు పుణ్యముంటుంది."

నాకు పెద్ద 'షాక్' తగిలినట్లైంది.

అంటే... అంటే... అతని విషయంలో ఆమెదీ నిజమైన ప్రేమ కాదన్నమాట!

వాళ్ళ అన్యోన్యతంతా నటనతో నిండివున్న నాటకమన్నమాట!

భగవాన్!—

లేచి త్వరగా మొహం కడుక్కుని గదిలోంచి బయటపడ్డాను.

వేరే గది వెదుక్కోవాలి!

ఇలాంటి నటుల పక్కనే వుండి వాళ్ళ డ్రామా డైలాగులూ, నటనా—వింటూ, చూస్తూ గడపడం నావల్లకాదు.